# మానవ సేవ

సూప్ కిచెన్ నించీ లతని పిక్ చేసుకుని కారులో ఇంటికి బయల్దేరాడు వాసు. 'ఎలావుంది ఇవాళ మీ సూప్ కిచెన్?' అడిగాడు.

'ఇవాళ ఎందుకోగానీ చాలమంది వచ్చారు. ప్రొద్దున్న పదినించే జనం రావటం మొదలుపెట్టారు. ఒకటిన్నరదాకా అలా వస్తూనే వున్నారు... ' అంది లత.

'నువ్వేమైనా తిన్నావా?' అడిగాడు వాసు.

చిన్నగా నవ్వింది లత. 'లేదు. నాకెందుకో అక్కడ తిన బుద్ధికాదు. అయినా ఇంకో పది నిమిషాల్లో ఇంటికి వెడుతున్నాం కదా' అంది. ఆమె ముఖంలో అలసట తెలుస్తూనే వుంది.

'అయితే తొందరగా వెడదాంలే' అన్నాడు వాసు, కారు స్పీడ్ పెంచుతూ.

పొద్దున్నే ఆరు గంటలకల్లా సరోజతో కలిసి సూప్ కిచెన్‌కి వెళ్ళింది లత. ప్రతి శనివారం లత, సరోజలు వాళ్ళ అమెరికన్ మిత్రులతో అక్కడికి వెడతారు. రావుగారూ మరి కొందరూ అక్కడికి శాండ్‌విచ్‌లు తయారుచేయటానికి కావలసిన బ్రెడ్డు, ఛీజ్, వెజిటబుల్స్, మీట్ మొదలైనవి పెద్ద పెద్ద పెట్టెల్లో తీసుకువస్తారు. పెద్ద సూపర్ మార్కెట్లలో అంతకు ముందురోజు చేసిన సరుకు, మిగిలిపోయినవన్నీ ఇలాటి ధర్మకార్యాలకి ఫ్రీగా ఇచ్చేస్తారు. ఈ సూప్ కిచెన్లకి లత, సరోజలాటి వాలంటీర్లు పొద్దున్నే వచ్చి సూపూ శాండ్విచ్‌లూ పదింటికల్లా సిద్ధంచేస్తారు. చుట్టుపక్కల వున్న హోంలెస్ వాళ్ళందరూ అప్పటినించీ రావటం మొదలుపెడతారు. ఒక్కొక్కరే వచ్చి, అవి తిని తిరిగి వెళ్ళేటప్పటికీ ఒంటిగంటా రెండవుతుంది. ఇలా ప్రతిసారీ కొంతమంది వాలంటీర్లు వచ్చి సహాయం చేస్తుంటారు.

రెడ్ సిగ్నల్ లైట్ వచ్చిందని, జంక్షన్ దగ్గర కారు ఆపాడు వాసు.

అక్కడ నలభై ఏళ్ళతను నుంచొనివున్నాడు. అతని చేతిలో ఒక అట్టముక్క. దానిమీద 'నేను హోంలెస్ వాడిని. సహాయం చేయండి' అని వ్రాసి వుంది.

అతను సిగ్నల్ దగ్గర కారు ఆపినప్పుడల్లా అట్టముక్కని అందరికీ కనపడే టట్టు పైకి పట్టుకుంటున్నాడు. అతని అదృష్టం బాగునప్పుడల్లా ఒక డాలరో, కొంత చిల్లరో ఇస్తున్నారు.

'నాకిలాటి వారికి ఏమీ ఇవ్వాలనిపించదు' అన్నాడు వాసు. అతను ప్రతి రోజూ అలా అంటూనే వుంటాడు కాబట్టి లత ఏమీ అనలేదు.

'ఎన్నో దేశాలనించీ వచ్చి, ఎంతో కష్టపడి అందరూ ఈ అవకాశాల దేశంలో బ్రతికి బాగుపడుతుంటే, వీడిలాటి వారు వట్టి పరాన్నభుక్కులు. ఒళ్ళు బలుపా... పని చేసుకోలేరూ...' అన్నాడు.

'పీత కష్టాలు పీతకే తెలుస్తాయి. మనకేం తెలుసు' లత రోజూలాగానే

ఎక్కువ మాట్లాడలేదు.

అపాత్రదానం మంచిదికాదు. బద్ధకస్తులనీ, పని దొంగలనీ పెంచుతుంది. కానీ అవిటివాళ్ళో రోగిష్టులో ముసలివాళ్ళో పరిస్థితులకి తల వంచి అలా రోడ్డెక్కితే, అవసరమైన సహాయం చేయటం తప్పదు మరి.

వాసు ఆలోచనలని గమనించిన లత అంది, 'ఒక మనిషి ఇంకొక మనిషికి సహాయం చేయటం కనీస మానవ ధర్మం. ఆ సహాయం చిన్న మాట సహాయం కావచ్చు, ఒక రోజు కడుపు నింపే కాస్త తిండి కావచ్చు, మనకి వున్నదానిలో ఎంతో కొంత ధన సహాయం కావచ్చు, రోగ్యాన్ని కాపాడే అవసరమైన మందులు కావచ్చు, ప్రాణాలు కాపాడే పెద్ద సహాయం కావచ్చు. అదెలాటి సహాయం అన్నదానికన్నా అలా ముందుకి రావటానికి వచ్చే మనసుండే, అదీ ముఖ్యం. అది నీలోనూ నాకున్నంత వుందని తెలుసు. నాతో పాటూ నువ్వూ ఎన్నో 'కేరింగ్ అండ్ షేరింగ్' కార్యక్రమాల్లో నా పక్కనే నిలబడ్డావు. బద్ధకస్తులని పోషించటం గురించి నువ్వు చెప్పింది నాకు అర్థమైంది. ఒప్పుకుంటాను. కానీ రోడ్డు మీద ఎవరైనా ఆకలితో చస్తుంటే మనకి వాళ్ళ నిజాయితీ గురించి తెలుసుకునే సమయం కానీ, అవకాశం కానీ వుండవు.. అవునా... ' అంది.

వాసుకి తెలుసు లత మనసులో భావాలు. ఎన్నో ఏళ్ళనించీ కమ్యూనిటీలో ఎంతో సహాయం చేస్తూనేవున్నారు ఇద్దరూ. అలాగే అక్కడ యూనివర్సిటీలో ఎయిడ్ అని ఒక స్టూడెంట్ ఆర్గనైజేషన్ వుంది. ఇండియాలో రకరకాల సహాయ కార్యక్రమాలు చేస్తుంటారు ఆ ఆర్గనైజేషన్ వారు.

ఒకసారి భాగవతుల పరమేశ్వరరావుగారు అమెరికా వచ్చినప్పుడు వారిని కలిశాడు వాసు. డాక్టర్ పరమేశ్వరావ్‌గారు అమెరికాలో మంచి ఉద్యోగంలో వుండి, వృత్తిలో ఎంతో సంతృప్తితో, సుఖంగా వున్నా ఆయనకి ఇండియా వెళ్ళి అక్కడ గ్రామాల్లో ప్రజలకి యధాశక్తి సహాయ సేవా కార్యక్రమాలు చేయాలని గట్టి అభిలాష. భార్యాబిడ్డలు అమెరికాలో వుండగా, ఆయన విశాఖపట్నం దగ్గర ఎలమంచిలి తాలూకాలో ఒకపూరి గుడిసెలో నివాసం ఏర్పరుచుకుని, తన కార్యక్రమాలు మొదలు పెట్టారు. అక్కడ తనతోపాటూ తేళ్ళూ, పాములూ నివాసం చేసేవిట.

అక్కడ త్రాగటానికి నీరు కానీ, పండే పంటలు కానీ, చల్లదనాన్నిచ్చే చెట్లు కానీ లేవు. గ్రామంలో పిల్లలకి బడీ, ఆరోగ్య సదుపాయాలకి ఆసుపత్రిలాటివి కూడా ఏమీలేవు. అటువంటి చోటుకి ఆయన వచ్చి, ఏ ప్రభుత్వం తోటీ సంబంధం లేకుండా మొదలు పెట్టిన మానవతా యజ్ఞం అది. మొదట్లో గ్రామీణులు కూడా ఆయన్ని నమ్మలేదుట. కొన్ని రోజుల్లోనే ఆయన ఆ గ్రామాన్ని పూర్తిగా మార్చివేశాడు. అన్ని సదుపాయాలనీ ఆయన ఆధ్వర్యంలో గ్రామస్థులు అమర్చుకున్నారు. అంతేకాదు ఏడెనిమిది వందల గ్రామాలు అదే రకంగా ప్రగతి పథంలోకి వెళ్ళాయి.

ఆయన చెప్పేది ఒక్కటే. 'మీ ఇంటినీ, మీ వూరునీ బాగుచేసుకోవల్సింది మీరే. కాకపోతే నాకు తెలిసిన విషయాలు, నేను మా వూరిని ఎల మార్చగలిగానో చెబుతాను. అది చూసి మీ వూరిని మీరే సరిదిద్దుకోండి అని. ఎవరి ఇంటి దీపం

వాళ్ళే వెలిగించుకుంటే, వూరంతా వెలుగే అని ఆయన విశ్వాసం. అలాగే ఆయన కొంతమంది యువకులకి ట్రైనింగ్ ఇచ్చి , వారి పక్కనే నిలబడి సహాయం చేశారు. పరమేశ్వరావ్‌గారి ట్రస్ట్ పేరు భాగవతుల ట్రస్ట్. 'ఇలాటి సేవా కార్యక్రమాలకి కావలసింది డబ్బు కాదు. కార్య దీక్ష. మీమీద మీకే విశ్వాసం' అంటారాయన.

ఆయన ఈ కార్యక్రమాలు చేస్తున్నప్పుడు కొంతమంది రాజకీయ నాయకులూ, గవర్నమెంట్ ఉద్యోగులూ, కొన్ని న్యూస్ పేపర్లూ ఆయన కాళ్ళకి అడ్డం రావటమే కాకుండా, ఆయన పేరుకి మసి పూసి చాల ఇబ్బంది పెట్టారు. కానీ ఆయన ఏమీ చలించకుండా చేపట్టిన కార్యక్రమాలని, రెట్టించిన ఉత్సాహంతో పూర్తి చేశారు. అమెరికానించీ, ఇతర దేశాలనించీ, ఇండియానించీ ఎంతోమంది వాలంటీర్లు ముందుకి వచ్చి, కార్యక్రమాల్లో శ్రమదానం చేశారు.

మిగతా కార్యక్రమాల్లో కూడా కొంతమంది అమెరికా నించీ ఇండియా వెళ్ళి రకరకాలుగా, వికలాంగులైన పిల్లలకీ, చెమిటి గుడ్డివారికి చదువు చెప్పటం. వారికి కావలసిన పరికరాలు సమకూర్చటం మొదలైన సహాయాలు చేస్తున్నారు.

గుజరాతులో భూకంపం వచ్చి వేలమంది చనిపోయినప్పుడు, అమెరికాలో ఎన్నో కంపెనీలు ఉదారంగా ధన సహాయం చేశాయి. కొన్ని కంపెనీలు, ఉద్యోగులు ఎంత ఇస్తే అంత మేచ్ చేశారు. అంటే నేను వంద డాలర్లు ఇస్తే, మా కంపెనీ దానికి ఇంకో వంద కలిపి రెండొందలు చేసిందన్నమాట.

మనకి ఇండియాలో చేయాలంటే ఎన్నో ధర్మ కార్యాలున్నాయి. దైవ కార్యాలకి, తమ డబ్బు ఖర్చు పెట్టుకోవటం వారివారి ఇష్టం. కాకపోతే మానవసేవే మాధవసేవ. ఎక్కడో వున్న దేవుడి కన్నా, కళ్ళ ముందు సహాయం కోసం వేయి కళ్ళతో నిరీక్షిస్తున్న వాళ్ళకి సహాయం చేయటం, దైవకార్యం కాదూ!

చదువుకునే పిల్లలకి ధన సహాయం చేస్తే. అదే సరస్వతీ పూజ.

అలాగే కాళ్ళు లేనివాళ్ళకి చక్రాల కుర్చీలు, చెవిటివారికి హియరింగ్ ఎయిడ్స్, కళ్ళు లేనివారికి నేత్ర దానం... ఇవన్నీ మాధవ సేవలో పళ్ళూ, పత్రాలే.

ఇలాటి కార్యక్రమాలు చేసే స్వచ్ఛంద సంస్థలకి అండగా నిలబడటం మానవ ధర్మం. అదే నిజమైన మాధవ సేవ!

0 0 0